సాక్షి అనకాపల్లి

మంగళవారం। 2। మే। 2023



ఘనంగా మేడే

కార్మికులు సోమవారం మేడే ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. అనకాపల్లిలో సిటు కార్యాలయంలో ఎర్ర జెండా ఎగరేశారు.



మైదానం పిలుస్తోంది

చిన్నారులకు వేసవి క్రీడా శిక్షణ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల నిర్వహిస్తున్నారు. 8లో



'స్పందన'కు వర్షం ఎఫెక్ట్

వర్షం తాకిడి వల్ల కలెక్టరేట్ స్పందనకు సోమవారం అర్జీలు తక్కువగా వచ్చాయి. కలెక్టర్, జేసీ వినతులు స్వీకరించారు. 8లో

న్యూస్‌రీల్

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ



మూలపేటలో పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు

మునగపాక: వర్షంలోనూ ఠంచనుగా పింఛన్ పంపిణీ ప్రారంభమైంది. ఒకటో తేదీ కావడంతో సోమవారం పలు గ్రామాల్లో ఉదయం నుంచి కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

సీఎం కప్ హాకీ పోటీలకు యలమంచిలి క్రీడాకారిణులు



ఎంపికైన క్రీడాకారులు

యలమంచిలి: సీఎం కప్ మహిళా హాకీ పోటీలకు ఆరుగురు యలమంచిలి క్రీడాకారులు ఎంపికయ్యారని యలమంచిలి హాకీ అసోసియేషన్ కార్యదర్శి కొఠారు నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి తిరుపతిలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున ఆడుతున్న జట్టులో యలమంచిలి హాకీ క్రీడాకారిణులు లొట్ల మేరీ, కృపసాయి, సంధ్య, శిరీష, కుసుమ, మహేశ్వరిలకు స్థానం లభించినట్టు ఆయన తెలిపారు. యలమంచిలి హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి.రెడ్డి, సీనియర్ హాకీ క్రీడాకారులు వారిని అభినందించారు.

10లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

తుమ్మపాల: ప్రతి ఉద్యోగి, పెన్షనర్ ఈనెల 10వ తేదీలోగా ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈకేవైసీ) చేయించుకోవాలని జిల్లా ఖజానా అధికారి వి.లక్ష్మీ సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగి తమ సీఎఫ్ఎంఎస్ ఐడీని ఆధార్‌కు లింక్ చేసి మొబైల్ నెంబర్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఈకేవైసీ చేసుకోవచ్చన్నారు. పెన్షనర్లు తమ ఉప ఖజానా కార్యాలయానికి ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌తో హాజరు కావాలన్నారు. లైఫ్ సర్టిఫికెట్లు ఇంకా ఇవ్వని పెన్షనర్లు తక్షణమే సమర్పించాలన్నారు.

అనకాపల్లి వరకే రత్నాచల్, సింహాద్రి

అనకాపల్లి టౌన్: దువ్వాడ రైల్వేస్టేషన్ ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈనెల 7వ తేదీ వరకు రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను అనకాపల్లి స్టేషన్ వరకే నడుపుతున్నామని స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. విశాఖ చేరుకునే ప్రయాణికుల కోసం స్థానిక డిపో నుంచి ఉదయం, సాయంత్రం 14 బస్సులను నడుపుతున్నట్టు ఆయన తెలిపారు.

రిటైర్డ్ సుబేదార్‌కు స్వగ్రామంలో ఘన సత్కారం



కోన రామును అభినందిస్తున్న సైనికులు, మాజీ సైనికులు

కశింకోట: సుబేదార్ ర్యాంకులో ఉద్యోగ విరమణ చేసి స్వస్థలం కశింకోటకు వచ్చిన కోన రాముకు స్థానికంగా ఉన్న సైనికులు, మాజీ సైనికులు, అభిమానులు సోమవారం ఘన స్వాగతం పలికారు. పూలదండలు, పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువా కప్పి అభినందించారు. 1995లో సైన్యంలో చేరి దేశంలో పలుచోట్ల పనిచేసి నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్, సుబేదార్‌గా పదవులు నిర్వర్తించి రిటైరై వచ్చిన సందర్భంగా రాముకు ఘన స్వాగతం పలికి స్థానిక పడమటమ్మ ముఖద్వారం నుంచి ఉప్పునీటి దిబ్బ వరకు ఊరేగించారు.

కొనసాగుతున్న చందనం అరగదీత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత సోమవారం కొనసాగింది. ఈనెల 5న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనం సమకూర్చేందుకు ఆదివారం నుంచి అరగదీతను ప్రారంభించారు. తొలిరోజు 43 కిలోల చందనాన్ని, రెండో రోజు సోమవారం మరో 43 కిలోల చందనాన్ని అరగదీశారు.

బాబ్జీకి భరత్ గండి!

- విశాఖ దక్షిణ సీటు కోసం కసరత్తు
- మీ కోసం–మీ భరత్ పేరుతో పాదయాత్ర
- పెందుర్తి సీటుపై గండి బాబ్జీ కన్ను
- ఇదే అదనుగా బండారుపై అవినీతి ఆరోపణలు?
- పాయకరావుపేట నియోజకవర్గంలో అనితపై కాపు నేతల ఫైర్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీడీపీలో రేగుతున్న వివాదాలు

తెలుగుదేశం పార్టీలో అంతర్గత కుమ్ములాటలు క్రమంగా పెరుగుతున్నాయి. గంటా–అయ్యన్నతో మొదలైన ఈ విభేదాలు కాస్తా తాజాగా విశాఖ దక్షిణ, పెందుర్తి నియోజకవర్గాలకూ పాకుతున్నాయి. విశాఖ దక్షిణ సీటుపై భరత్ కన్నేయగా.. గండి బాబ్జీ చూపు కాస్తా పెందుర్తిపై పడింది. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు అవినీతిపరుడంటూ ఆయన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. మరోవైపు పాయకరావుపేటలో గంటా, ఎమ్మెల్సీ చిరంజీవి ఫొటోలు లేకుండానే అనిత ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వహించడంపై ఆ పార్టీ కాపు నేతలు మండిపడుతున్నారు. అయినా అయ్యన్న అండతో అనిత తగ్గేదేలే అంటున్నారు. మొత్తంగా తెలుగుదేశం పార్టీలో విభేదాల పర్వం క్రమంగా అన్ని నియోజకవర్గాలకు పాకుతోంది.



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

తెలుగుదేశం పార్టీలో విశాఖ దక్షిణ సీటు కాస్తా హీటు పుట్టిస్తోంది. విశాఖ దక్షిణం నుంచి పోటీ చేసేందుకు భరత్ ఆసక్తి చూపుతుండటం.. పెందుర్తి నియోజకవర్గంలోనూ సెగలు రేపుతోంది. గత ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి ఓటమి పాలైన భరత్ ఇప్పుడు విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వీలుగా 'మీ కోసం– మీ భరత్' పేరుతో పాదయాత్రలు చేస్తున్నారు. ఈ పాదయాత్రలు కూడా కేవలం దక్షిణ నియోజకవర్గానికే పరిమితం కావడం చర్చనీయాంశమవుతోంది. విచిత్రంగా ఈ పాదయాత్రలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న గండి బాబ్జీ కూడా పాల్గొంటుండటం గమనార్హం. ఇది కాస్తా ఇప్పుడు పెందుర్తి నియోజకవర్గంలో చర్చకు దారితీసింది. పెందుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వీలుగా గండి బాబ్జీ పావులు కదుపుతున్నారన్న చర్చ నడుస్తోంది. ఇదే అదునుగా గత ఎన్నికల్లో తనకు సీటు ఇస్తే గెలిచేవాడినని.. అవినీతి వ్యవహారంలో కూరుకుపోయిన బండారు ఓడిపోతారని తాను ముందే పార్టీ పెద్దలకు చెప్పినట్టు గండి బాబ్జీ వ్యాఖ్యానించడం కొత్త చర్చకు తెరలేపింది. మరోవైపు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో గంటా శ్రీనివాసరావు, చిరంజీవి వంటి నేతల ఫొటోలు లేకుండా పాయకరావుపేట నియోజకవర్గంలో అనిత ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వ్యవహారంపై ఆ పార్టీ కాపు నేతలు మండిపడుతున్నారు. తమను చిన్నచూపు చూస్తున్న అనిత తీరు మార్చుకోకపోతే అంతిమంగా తామంతా టీడీపీకి దూరమవుతామని కూడా నియోజకవర్గ కాపు నేతలు హెచ్చరించారు. ఇక ఇప్పటికే గంటాకు అయ్యన్నకు మధ్య పచ్చగడ్డి వేయకపోయినా మండుతున్న పరిస్థితి నెలకొంది. మొత్తంగా తెలుగుదేశం పార్టీలో నేతల మధ్య రేగుతున్న విభేదాలు క్రమంగా అన్ని నియోజకవర్గాల్లో రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.

నేత లేకపోవడంతో..

విశాఖ దక్షిణ నియోజకవర్గానికి టీడీపీకి నాయకుడు లేని పరిస్థితి ఉంది. ఎమ్మెల్యేగా ఉన్న వాసుపల్లి గణేష్‌కుమార్ కాస్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీని కాదని దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి కాస్తా దక్షిణ నియోజకవర్గంలో నాయకుడు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గండి బాబ్జీని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. అయిష్టంగానే ఈ బాధ్యతలను స్వీకరించిన గండి బాబ్జీ.. నామమాత్రంగా కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. ఇప్పుడు తెరపైకి భరత్ రావడంతో.. తన కన్ను కాస్తా పెందుర్తిపై పడింది. ఇదే అదనుగా బండారుతో పాటు ఆయన కుమారుడిపై కూడా అవినీతి ఆరోపణలు రావడంతోనే గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మరోసారి ఆయనకు సీటు ఇచ్చినా ఓటమి తథ్యమని కూడా తన సన్నిహితుల వద్ద ఆయన వ్యాఖ్యానిస్తున్నట్టు సమాచారం.



సెల్ఫీ నీకు.. టికెట్ నాకు..

గంటా-అయ్యన్న మధ్య మరింత గ్యాప్!

గంటా శ్రీనివాసరావుకు, అయ్యన్న పాత్రుడుకు మధ్య రోజురోజుకీ గ్యాప్ మరింత పెరుగుతోంది. ఇప్పటికే తన నియోజకవర్గంలో గంటా తలదూరుస్తున్నారన్న అనిత... తాజాగా ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో ఆయన ఫొటో లేకుండానే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి కార్యక్రమాలను నిర్వహించారు. ఇక కొద్దిరోజుల క్రితం ఉత్తరాంధ్ర సమీక్ష కోసం విశాఖ వచ్చిన చంద్రబాబుకు ముందురోజే అయ్యన్న ఝలక్ ఇచ్చారు. తాను సమీక్షకు రానని భీష్మించుకూర్చున్నారు. నర్సీపట్నంతో పాటు అనకాపల్లి ఎంపీ సీటు వ్యవహారంలో గంటా తలదూర్చడంతో పాటు ఇన్ని రోజులుగా మిన్నకుండి ఇప్పుడు అంతా తానై వ్యవహరిస్తూ తమను పార్టీకి దూరం చేస్తున్నారని అయ్యన్న మండిపడ్డారు. ఈ నేపథ్యంలో చివరకు చంద్రబాబు దిగివచ్చి సమీక్ష సందర్భంగా అయ్యన్నకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు గంటాను దూరంగా ఉంచారు. ఇదే అదనుగా అనిత కూడా గంటా ఫొటో లేకుండానే తన నియోజకవర్గంలో కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిపై ఆ పార్టీ కాపు నేతలు మండిపడుతున్నప్పటికీ తగ్గేదేలే అని ముందుకు వెళుతున్నారు. మొత్తంగా టీడీపీలో ఈ అసమ్మతి వ్యవహారం క్రమంగా అన్ని నియోజకవర్గాలకు పాకుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

అధికారులకు విశాఖ కలెక్టర్ దిశానిర్దేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఈ నెల 3న జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి కలెక్టర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధురవాడ హిల్ నెం 4 పై అదానీ డేటాసెంటర్‌కు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. ఎల్ఈడీ స్క్రీన్స్, ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఎన్ఐసీ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ముగిసేంత వరకూ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన జనరేటర్లు సిద్ధం చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల వెల్లువ

- పారిశ్రామిక జిల్లాగా అనకాపల్లి
- విద్యార్థులకు బంగారు భవిష్యత్తు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్
- 58 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

తుమ్మపాల: పారిశ్రామిక జిల్లాగా అనకాపల్లిని అభివృద్ధి చేస్తున్నామని, చదువుకున్న యువతకు జిల్లాలోనే ఉపాధి, ఉద్యోగాలు రానున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, కళాశాల నుంచి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన 58 మంది విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో 192 స్కిల్ హబ్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇప్పటికే పరవాడ, అచ్యుతాపురం పారిశ్రామిక కేంద్రాలు ఉన్నాయని, త్వరలో కోడూరు, నక్కపల్లిలో పారిశ్రామిక పార్కులు పనులు ప్రారంభం అవుతాయన్నారు. కోడూరులో 100 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు, ఆటోనగర్ ఏర్పాటుతో ఈ ప్రాంతం పూర్తిగా మారిపోతుందన్నారు. అచ్చుతాపురంలో గ్రీన్ హైడ్రోజన్ పార్క్, నక్కపల్లి ప్రాంతంలో పెట్రో కెమికల్ పరిశ్రమలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. ఈ నెల 3వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో భూమిపూజ చేసే అదాని కంపెనీలో 25 వేల ఐటీ ఉద్యోగాలు లభించనున్నట్టు తెలిపారు. రూ.17 వేల కోట్లతో ఐటీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు జరుగుతుందన్నారు. ఈ కళాశాల ప్రతిభావంతులైన విద్యార్థులను తయారుచేసి అందిస్తుందని, ఎన్‌బీఏ గుర్తింపు కూడా పొందడం మంచి పరిణామమన్నారు. ఎన్‌బీఏ గుర్తింపునకు కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు, అధ్యాపకులు మంత్రిని దుశ్శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, పీఏసీఎస్ చైర్మన్ బంటు ఏడుకొండలు, మంత్రి సత్తిబాబు, కొల్లిమల్ల గోవిందరావు, కోట సత్తిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన కళాశాల విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

చిక్కని పాలు.. చక్కని ధర

- నాణ్యతే ప్రామాణికంగా జగనన్న పాల వెల్లువ
- జిల్లాలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు
- పాల సేకరణలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ
- రెండేళ్లలో ఆరుసార్లు పెరిగిన పాల సేకరణ ధరలు



సాక్షి, అనకాపల్లి: నాణ్యతే ప్రామాణికంగా జగనన్న పాల వెల్లువ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. పాల సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు జిల్లాలో కమాండ్ కంట్రోల్ సెంటర్ల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఈ సెంటర్లు పనిచేస్తాయి. డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖ, సహకార శాఖల నుంచి ఇద్దరేసి చొప్పున మొత్తం ఆరుగురు సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా ఈ సెంటర్లో సేవలందిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా కేటాయిస్తున్నారు. ప్రతీరోజు కనీసం 30 మంది మహిళా పాడి రైతు సంఘాల కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ల సిబ్బంది మాట్లాడే అవకాశం ఉంటుంది. పాలు పోసే మహిళా పాడిరైతులతోపాటు రూట్ ఆఫీసర్లు అమూల్ టీంకు జిల్లా స్థాయిలో ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తారు. పాల సేకరణ, ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతం గుర్తింపు, సకాలంలో డబ్బులు జమ వంటి విషయాల్లో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను తెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేస్తారు. ఏ గ్రామంలో అయినా పాలసేకరణ తగ్గినట్లుగా గుర్తిస్తే వెంటనే అందుకు గల కారణాలను విశ్లేషించి ప్రత్యేక టీంలను కమాండ్ కంట్రోల్ సెంటర్లు పంపిస్తాయి. ఇందుకోసం ఎంపీడీఓ, తహసీల్దార్ల నేతృత్వంలో మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తారు. వీరి ఆధ్వర్యంలో రైతుల్లో చైతన్యం తీసుకొచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా...



జగనన్న పాల వెల్లువ ద్వారా అమూల్ తరఫున ఉత్తరాంధ్రలో పాలు సేకరిస్తున్న బనస్కాంత్ జిల్లా కో ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ ఆరుసార్లు పాలసేకరణ ధరను పెంచడంతో పాటు వెన్న, ఘనపదార్థాల సేకరణ ధరలను కూడా పెంచింది. జిల్లాలో ఉన్న ఏఎంసీయూలో రూ.2 లక్షల విలువ గల పరికరాలను ఏర్పాటు చేశారు. త్వరలో అన్ని ఆర్‌బీకేల పరిధిలో పాల సేకరణ చేపట్టేలా చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ ప్రసాదరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

పాల సేకరణ

9 మండలాల పరిధిలో 192 గ్రామాల నుంచి

148 సెంటర్ల నుంచి రోజుకు 20 వేల లీటర్లు

సేకరణ ధర పెరిగిందిలా..

ప్రారంభంలో	ప్రస్తుతం
గేదె పాల ధర లీటర్‌కు రూ.71.47	గేదె పాల ధర లీటర్‌కు రూ.87.52
ఆవు పాల ధర రూ.34.20	ఆవు పాల ధర రూ.42.46

వర్షంతో పులకింత



మాడుగుల మండలం వీరవిల్లిలో తడిచిన వరి పనలను ఒడ్డుకు చేర్చుతున్న రైతులు

సాక్షి, విశాఖపట్నం/అనకాపల్లి: కొద్ది రోజుల క్రితం వరకు ఉమ్మడి విశాఖ జిల్లా ఉష్ణతాపంతో అట్టుడికింది. కానీ ద్రోణి ప్రభావంతో నాలుగు రోజుల నుంచి ఆ పరిస్థితిలో మార్పు వచ్చి వాతావరణం ఒకింత చల్లబడింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షపాతం (6 సెం.మీ లకు పైగా) నమోదైంది. ఫలితంగా వానలు, చల్లదనం కోసం పరితపిస్తున్న జనానికి పెద్ద ఉపశమనం కలిగినట్టయింది. కాగా వర్షానికి ఈదురు గాలులు కూడా తోడవడంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మంగళ, బుధవారాల్లోనూ ఉమ్మడి విశాఖ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. అదే సమయంలో పిడుగులు పడే ప్రమాదం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అకాల వర్షాలకు అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల రబీ వరి చేలు నీట తడిచాయి. అయితే అపరాలకు, కూరగాయ పంటలకు ఈ వర్షాలు మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు.

వింత వాతావరణం

విశాఖలో అత్యంత అరుదైన వాతావరణ పరిస్థితి సోమవారం నెలకొంది. సాధారణంగా ఏ సీజనులోనైనా పగటి (గరిష్ట) ఉష్ణోగ్రతలకంటే రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయి. ఈ రెండింటి మధ్య 5–15 డిగ్రీల వరకు వ్యత్యాసం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వీటి మధ్య వ్యత్యాసం ఇంకాస్త తక్కువగా ఉండే అవకాశమూ ఉంది. అయితే విశాఖలో సోమవారం పగటి ఉష్ణోగ్రత 26.2 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రత 27.4 డిగ్రీలు నమోదయ్యాయి. అంటే పగటి ఉష్ణోగ్రతకంటే రాత్రి ఉష్ణోగ్రత 1.2 డిగ్రీలు అధికంగా రికార్డయ్యాయి. ఫలితంగా పగలుకంటే రాత్రి వేళే వెచ్చదనం అనుభూతి కలిగింది. ఇటీవల కాలంలో ఇలాంటి పరిస్థితి విశాఖలో ఎప్పుడూ లేదని వాతావరణ నిపుణులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకిలా అంటే..?

ద్రోణి ప్రభావంతో సోమవారం ఉదయం నుంచే వర్షం కురవడం మొదలైంది. మధ్యాహ్నం వరకు ఎండ ఛాయలే లేకుండా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. దీనికి తోడు గాలిలో తేమ కూడా అధికంగానే (90 శాతం) ఉంది. అదే సమయంలో ఆగ్నేయ, నైరుతి గాలులకు బదులు కాసేపు ఈశాన్య గాలులు కూడా వీచాయి. ఫలితంగా రాత్రి ఉష్ణోగ్రతలకంటే పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవడానికి దోహదపడిందని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణం, సముద్ర అధ్యయన విభాగం మాజీ అధిపతి ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ 'సాక్షి'కి చెప్పారు. ఇలాంటి వాతావరణం అత్యంత అరుదుగా ఏర్పడుతుందన్నారు. ఎండ కాసి ఉష్ణోగ్రతలు పెరిగే సమయంలో వర్షం కొనసాగడం వల్ల కనిష్టంకంటే గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుదల కనిపించిందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద తెలిపారు.

మేడే నాడు ఏటా వర్షం?!

విశాఖలో సోమవారం ఉదయం వర్షం కురవడంలో మరో ప్రత్యేక ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. గడచిన ఏడు సంవత్సరాలుగా విశాఖపట్నంలో మే డే నాడు క్రమం తప్పకుండా వర్షం కురుస్తోందని చెబుతున్నారు. 2017 నుంచి ఈ ఏడాది వరకు పరిశీలిస్తే ప్రతి మే డేన వాన కురిసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇది యాదృచ్ఛికమే అయినా ఈ సంగతిని ఎరిగిన నిపుణులు విశేషంగా చెప్పుకుంటున్నారు. సింహాచలం అప్పన్న చందనోత్సవం నాడు వర్షం కురవడం ఆనవాయితీ అన్నది ఎప్పట్నుంచో ప్రజల్లో నమ్మకంగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీని కొనసాగిస్తూ చందనోత్సవం రోజున చిరుజల్లులు కురవడం విశేషం!



అకాల వర్షంతో గొడుగులు, రెయిన్ కోట్లను ఆశ్రయించిన జనం

ఉమ్మడి విశాఖ జిల్లాలో వర్షపాతం (సెం.మీల్లో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
అనకాపల్లి	నర్సీపట్నం	6.5
అనకాపల్లి	బుచ్చెయ్యపేట	6.4
అనకాపల్లి	వడ్డాది	6.1
విశాఖపట్నం	పెదగంట్యాడ	6.1
అనకాపల్లి	రోలుగుంట	5.1
అనకాపల్లి	రావికమతం	4.9
అనకాపల్లి	కోటవురట్ల	4.2
అనకాపల్లి	మాడుగుల	4.0

ముమ్మరంగా సూక్ష్మ సేద్యం రిజిస్ట్రేషన్లు

- లక్ష్యం 1200 హెక్టార్లు
- ఇప్పటివరకు నమోదు 1107 హెక్టార్లు

అనకాపల్లి రూరల్: జిల్లాలో సూక్ష్మ సేద్యం రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. 2023–24 సంవత్సరానికి రైతుల నుంచి దరఖాస్తులు లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. జిల్లాలో ఈ ఏడాది ఏపీఎంఐపీ లక్ష్యం 1200 హెక్టార్లు కాగా తొలి త్రైమాసికంలోనే ఇప్పటివరకూ 1107 హెక్టార్లకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జి.వి.లక్ష్మి తెలిపారు. రైతులు పరికరాల కోసం సంబంధిత ఆర్బీకేల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. బిందు, తుంపర సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులకు భూ విస్తీర్ణం మేరకు రాయితీ లభిస్తుందని తెలిపారు. బిందు సేద్యం పరికరాలకు సంబంధించి ఐదెకరాలలోపు భూమి ఉన్న చిన్న సన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 12.5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. అలాగే తుంపర సేద్యానికి సంబంధించి 5 ఎకరాల లోపు భూమి ఉంటే 55 శాతం, 5 ఎకరాల పైబడి ఉంటే 45 శాతం రాయితీపై పరికరాలు తీసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఈ నెల 15 తర్వాత క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామని ఆమె తెలిపారు. జిల్లాకు సంబంధించి ఫినోలెక్స్, సిగ్నేట్, కొఠారి కంపెనీలకు అనుమతిస్తున్నామని చెప్పారు.

'స్పందన'కు వర్షం ఎఫెక్ట్

తగ్గిన అర్జీలు
సత్వర స్పందనకు కలెక్టర్ ఆదేశం

తుమ్మపాల: స్పందన ఫిర్యాదులు, అర్జీలపై తక్షణమే స్పందించి, స్పష్టమైన సమాధానమివ్వాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాల్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ జాహ్నవి, డీఆర్వో వెంకటరమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులపై జిల్లాలో వివిధ శాఖల పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. వ్యవసాయ, డీఆర్‌డీఏ శాఖల పనితీరు బాగుందన్నారు. సోమవారం ఉదయం నుంచి ఆగకుండా కురిసిన వర్షానికి అర్జీదారుల సంఖ్య తగ్గింది. గత వారంతో పోల్చితే ఈ వారం స్పందన దరఖాస్తులు సగానికి పడిపోయాయి. కేవలం 82 అర్జీలు మాత్రమే వచ్చాయి. అర్జీదారులు రాకపోవడంతో మధ్యాహ్నం 1 గంటకే స్పందన కార్యక్రమం ముగిసింది.

- పాయకరావుపేట మండలం నర్సాపురం సర్వే నెం.217-1లో 50 సెంట్ల సాగు భూమి ఇతరుల పేరున తప్పుగా ఆన్‌లైన్ అయ్యిందని, సవరించాలని కోరుతూ కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఏనుగు కనకలక్ష్మి స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.
- ఇంటిపన్ను లేనిదే విద్యుత్ మీటరు మంజూరు చేయడం లేదని, నూతనంగా నిర్మించుకున్న ఇంటికి ఇంటిపన్ను మంజూరు చేయాలని కోరుతూ దేవరాపల్లి మండలం చిననందిపల్లి గ్రామానికి చెందిన మేమాల పైడితల్లమ్మ స్పందనలో అర్జీ చేసుకుంది. గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన రెండు సెంట్ల స్థలంలో ఇంటిని నిర్మించుకున్నానని, విద్యుత్ మీటర్ వేయమంటే ఇంటిపన్ను కావాలంటున్నారని తెలిపింది. తన ఇంటికి విద్యుత్ వచ్చేలా సాయం చేయాలని కోరింది.
- జీవనోపాధి కోసం నిర్మించుకున్న రేకుల షెడ్డు తొలగించాలని కొందరు వ్యక్తులు తప్పుడు ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ చేసి తనకు న్యాయం చేయాలని అనకాపల్లి మండలం బట్లపూడి రాయుడుపేటకు చెందిన దొడ్డి వరలక్ష్మి స్పందనలో విన్నవించుకుంది. బట్లపూడి సర్వే నెం.3లో ఏలేరు కాలువ నిర్మాణానికి 1.70 ఎకరం భూమి కోల్పోయామని, మిగిలిన సెంటు భూమిలో రేకుల షెడ్డు వేసుకుని వృత్తిపనితో జీవనోపాధి పొందుతున్నట్టు తెలిపింది. షెడ్డును తొలగిస్తే జీవనోపాధి లేనట్లేనని, గ్రామంలో విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె కలెక్టర్‌ను కోరింది.


స్పందనలో అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

మైదానం పిలుస్తోంది

విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు మొదలయ్యాయి. ఒకప్పటిలా సెలవుల్లో అమ్మమ్మ/నాన్నమ్మ, తాతయ్యల కోసం గ్రామాలకు పరుగులు తీసే రోజులు కావివి. వేసవిలో ఏం నేర్చుకున్నారని ప్రశ్నించే కాలం. చదువే కాకుండా కనీసం ఏదో ఒక అదనపు అంశంలో కొంత ప్రావీణ్యం సంపాదించుకునే దిశగా తల్లిదండ్రుల సాయంతో నేటి తరం ఉరకలెత్తుతోంది. వారి ఉత్సాహాన్ని మరింత పదునుపెట్టేందుకు జిల్లాలో పలు వేసవి శిక్షణ కేంద్రాలు మొదలయ్యాయి.

- చిన్నారులకు వేసవి క్రీడా శిక్షణ కేంద్రాలు ప్రారంభం
- ఆరోగ్యం, ఆత్మరక్షణ కల్పించే యోగా, తైక్వాండోపై శిక్షణ
- జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ కేంద్రాలు

చోడవరం/అనకాపల్లిటౌన్: వివిధ క్రీడలకు సంబంధించి వేసవి శిక్షణ కేంద్రాలను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సోమవారం ప్రారంభించింది. ఆత్మరక్షణ, ఆరోగ్య సంరక్షణలకు కీలకంగా మారిన తైక్వాండో, యోగాలో శిక్షణ ఇచ్చేందుకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. 30 రోజుల పాటు ఈ కేంద్రా లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తైక్వాండో అసోసియేషన్, చోడవరం పతంజలి యోగా కేంద్రా ల ఆధ్వర్యంలో ఈ శిబిరాలు ప్రారంభమయ్యాయి. అనకాపల్లి, అక్కిరెడ్డిపాలెం తారకరామ కాలనీలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బాక్సింగ్, వుషు క్రీడల శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి.


చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో వేసవి శిక్షణలో పోటీ పడుతున్న బాలికలు

తైక్వాండోపై వేసవి శిక్షణ

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ చాలా అవసరంగా మారింది. బాలికలకు మరీనూ. దీంతో స్పోర్ట్స్ అథారిటీ ఈ వేసవి శిక్షణా తరగతుల్లో తైక్వాండో క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చింది. నెల రోజల పాటు శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ జిల్లాలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో తైక్వాండో, జూడోపై శిక్షణ ఇవ్వనున్నట్టు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి తెలిపారు. చోడవరం, అనకాపల్లిటౌన్, అనకాపల్లిలోని గాంధీనగరం, పరవాడ, బుచ్చెయ్యపేట(వడ్డాది) ప్రాంతాల్లో వేసవి ఉచిత శిక్షణా కేంద్రాలు ప్రారంభించారు. 5 నుంచి 16 సంవత్సరాల వయసున్న బాలబాలికలు ఈ శిక్షణలో చేరేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డు జెరాక్స్, రెండు ఫోటోలు తెచ్చి శిక్షణా కేంద్రాల్లో కోచ్‌ల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 1వ తేదీ నుంచి నుంచి ప్రారంభమైన ఈ కేంద్రాలు ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం రెండుపూటలా శిక్షణ ఇస్తాయన్నారు. 30వ తేదీతో శిక్షణ శిబిరాలు ముగుస్తాయన్నారు. ఈ వేసవి శిబిరాల క్యాంప్ ఇన్‌చార్జిగా చవల చంద్రశేఖర్‌ను నియమించారు.


అనకాపల్లిలోని అక్కిరెడ్డిపాలెంలో తలపడుతున్న బాక్సింగ్ క్రీడాకారులు

శిక్షణ ఇచ్చే కేంద్రాలు

అనకాపల్లి టౌన్	ఎన్టీఆర్ స్టేడియం (8341810905)
గాంధీనగరం	జెడ్పీ హైస్కూల్ (9000038959)
చోడవరం	గవర్నమెంట్ హైస్కూల్ (8500636408)
పరవాడ	జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ (9704801525)
బుచ్చెయ్యపేట	వడ్డాది హైస్కూల్ (9966168540)

యోగాతో ఆరోగ్యం

అందరికీ ఆరోగ్యాన్ని అందించే యోగాపై ఈ వేసవిలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఉచిత శిక్షణ కేంద్రాన్ని చోడవరం పతంజలి యోగా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇక్కడి ఉషోదయ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న యోగా కేంద్రంలో ఉచితంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు యోగా గురువు పుల్లేటి సతీష్ తెలిపారు. యోగాతో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం, శరీర సౌష్టవంతో పాటు ఏకాగ్రత లభిస్తుందన్నారు. చోడవరం ఉషోదయ కాలేజీలో ఈ వేసవి ఉచిత యోగా శిక్షణా కేంద్రాన్ని ఈ నెల 1 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు. చోడవరం పరిసర ప్రాంతాల విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. వివరాలకు 9291276900 నంబర్లో సంప్రదించవచ్చన్నారు.

భర్తను హతమార్చిన కేసులో అరెస్టులు

జ్యుడీషియల్ రిమాండ్‌కు భార్య, ప్రియుడు, ఆమె తండ్రి, మరో ముగ్గురు


భార్య ప్రీతి ప్రియుడు ప్రణయ్ లలిన్‌కుమార్ రాము రాజు

చోడవరం రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లాలో సంచలనం రేపిన భర్తను హతమార్చిన భార్య కేసులో నిందితురాలితోపాటు, ఆమె కన్నతండ్రి, ప్రియుడు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు అందించారు. చోడవరంలోని మారుతీనగర్‌కు చెందిన హతుడు ఉద్రాక్ష హరి విజయ్ భార్య ప్రీతి, తమ ఇంటి వెనుక ఉండే బలయాది సింహ సాయి ప్రణయ్‌కుమార్‌తో వివాహేతర సంబంధంపై తరచూ గొడవలు జరిగేవి. దీనిపై భర్త తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడన్న కోపంతో భర్తను చంపాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు ఏప్రిల్ నెల 17 రాత్రి ఆమె తండ్రి సామిరెడ్డి శంకరరావు, ప్రియుడు ప్రణయ్ కుమార్, ప్రీతి స్నేహితుడు లావేటి లలిన్‌కుమార్(చౌడపల్లి, అచ్యుతాపురం), కర్రి రాము(అచ్యుతాపురం), పిట్లకొండ రాజు అలియాస్ బషీర్(అనకాపల్లి), అనకాపల్లి సాయి కలిసి హతుడిని బాగా మద్యం సేవించేలా చేశారు. ఆ మత్తులో నిద్రపోతున్న హరివిజయ్‌ను తలగడతో అదిమి హతమార్చారు. చనిపోయాడని నిర్ధారణకు వచ్చాక రాత్రి 2 గంటల సమయంలో ప్రీతి తన కారులో మృతదేహాన్ని ఎక్కించుకుని, భర్త స్వగ్రామం అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్ మండలం తీసుకువెళ్తూ, మార్గం మధ్యలో తన భర్తకు గుండె పోటు వచ్చిందని పాడేరు ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యులు అతడు చనిపోయినట్టు నిర్ధారించారు. మృతుడి బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో, పాడేరు పోలీసులు అనుమానాస్పద మృతిగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ప్రీతి తండ్రి సామిరెడ్డి శంకరరావు పాడేరు పోలీసులకు లొంగిపోయి వాస్తవాలను వెల్లడించడంతో హత్య కేసుగా మార్చి, చోడవరం స్టేషన్‌కు కేసును బదిలీ చేసినట్టు సీఐ వెల్లడించారు. దీంతో కేసులో భాగస్వాములైన భార్య ప్రీతి, ఆమె ప్రియుడు ప్రణయ్, వారికి సహకరించిన లలిన్‌కుమార్, రాము, రాజులను ఆదివారం అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితులను సోమవారం జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్టు సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- బైక్‌ను ఢీకొని పరారైన గుర్తు తెలియని వాహనం

కశింకోట: మండలంలోని నూతల గుంటపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అందించిన వివరాలు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న బుల్లెట్‌ను అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని, పరార్ అయింది. దీంతో బుల్లెట్‌పై ప్రయాణిస్తున్న వారిలో తీడ గ్రామానికి చెందిన అడిగర్ల పెద గంగరాజు(31) తలకు బలమైన గాయం తగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు గోగాడ వినోద్, లాలం గంగాధర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉన్న గంగాధర్‌ను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వినోద్ అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో మరణించిన గంగరాజు మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు గంగరాజు పరవాడ పార్మాసిటీలోని ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. అడిగర్ల అచ్చిబాబు, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు. ఇంకా పెళ్లి కాలేదు. చేదోడుగా ఉన్న కుమారుడు అందని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.


నూతలగుంటపాలెం వద్ద రోడ్డు ప్రమాదం

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత

డిప్యూటీ సీఎం సమక్షంలో పార్టీలో చేరిన దాలిబాబు


డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో ఎ.కొత్తపల్లి టీడీపీ నేత మెంట దాలిబాబు

దేవరాపల్లి: మండలంలోని ఎ.కొత్తపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు మెంట దాలిబాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. తారువ క్యాంప్ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ చింతల సత్యవెంకటరమణ సమక్షంలో పార్టీలో చేరగా, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సోమవారం పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు ఆకర్షితులై, పార్టీలో చేరినట్టు దాలిబాబు స్పష్టం చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో పనిచేసి, గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని దాలిబాబు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

వలంటీర్‌కు రైల్వే ఉద్యోగం


శివాజీ

రావికమతం: కొత్తకోట గ్రామ వలంటీర్ అయితి శివాజీ రైల్వే ఉద్యోగం సాధించాడు. గుంటూరు డివిజన్‌లో ట్రాక్ మెయింటైనర్‌గా ఈ నెల 4న విధుల్లో చేరనున్నాడు. వలంటీర్ సతీష్ ఐటీఐ చేసి, ఆపై డిగ్రీ కూడా ఉత్తీర్ణుడయ్యాడు. కొత్తకోట సచివాలయం-2లో వలంటీర్‌గా పనిచేస్తూనే గతేడాది ఆగస్టులో విశాఖలో జరిగిన రైల్వే పరీక్షకు హాజరయ్యాడు. దీంట్లో ఉత్తీర్ణుడు కావడంతో, అతనికి ట్రాక్ మెయింటైనర్‌గా ఉద్యోగం లభించింది. దీంతో వలంటీర్ శివాజీని గ్రామ నాయకులు, అధికార్లు, సహచర వలంటీర్లు సోమవారం అభినందించారు. శివాజీ వలంటీర్‌గా తన విధి నిర్వహణలో చిత్తశుద్ధి కనబరచి, రెండు సార్లు సేవా మిత్ర అవార్డు పొందాడు.

కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి

యలమంచిలి: కార్మిక చట్టాల పట్ల కార్మికులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి అన్నారు. సోమవారం యలమంచిలి పట్టణంలో కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆటో, ట్యాక్సీ యూనియన్, వివిధ కార్మిక సంఘాల సమావేశంలో కార్మిక చట్టాల పట్ల అవగాహన కల్పించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాల వర్తింపులో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే కోర్టు సముదాయం పరిధిలో పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. కార్మికుల పిల్లలు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ఎక్కువగా అట్టడుగు, పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కార్మికుల పిల్లలు ఉన్నత విద్యనభ్యసించి అత్యున్నత స్థాయిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు తను చేసే వృత్తి పట్ల అంకిత భావంతో ఉంటే, సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ద్వారపురెడ్డి వెంకటరావు, రామకృష్ణరావు, కోర్టు సిబ్బంది నిర్మల, ఏఐటీయూసీ కార్యదర్శి ఏసుదాసు, ఆటో, ట్యాక్సీ యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు.


కార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి

రైలు ఢీకొని వ్యక్తి మృతి

పాయకరావుపేట: పట్టణంలోని నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన సుమారు 45 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తిని, గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందినట్లు తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం ఉదయం సమయంలో ఈ సంఘటన జరిగిందన్నారు. మృతుడి కుడి చేతిపై పచ్చబొట్టు ఉందన్నారు. చామనచాయ రంగు కలిగి, ఫుల్ హ్యాండ్స్ వంగపువ్వు రంగు గడుల షర్టు, సిమెంట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరచినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.


రైలు ఢీకొని మరణించిన గుర్తు తెలియని వ్యక్తి

పేదల పక్షం జగన్ ప్రభుత్వం

పింఛన్ల పంపిణీలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: పేదలకు అండగా ఉండటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని గాంధీగ్రామంలో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. వృద్ధులకు పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేద వృద్ధులు, వితంతువులు, వికలాంగులందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. గతంలో పింఛన్లు తీసుకోవడానికి పంచాయతీ కార్యాలయాల వద్ద రోజుల తరబడి, ఎండావానల్లో నిలబడి, వృద్ధులు నానా ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థను తెచ్చి ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛన్ దారుల ఇంటికే వెళ్లి, పింఛన్ డబ్బులు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, స్కూల్ కమిటీ చైర్మన్ దాడి జగదీష్ పాల్గొన్నారు.


గాంధీ గ్రామంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ముగిసిన టెన్నిస్ టోర్నమెంట్


విజేతలతో రత్నాకర్, ఏటీఏ, జార్జి క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక జార్జి క్లబ్‌లో అనకాపల్లి జిల్లా టెన్నిస్ అసోసియేషన్(ఏటీఏ) ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రముఖంగా గుర్తింపు పొందిన ఏటీఏ ఈ టోర్నమెంట్‌ను ఈ స్థాయిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో విజయనగరానికి చెందిన జోడీ టి.రామారావు, ఎం.వి.రాజు ప్రథమస్థానంలో నిలిచారు. విశాఖకు చెందిన జోడీ రవిశంకర్, తిలక్‌లు ద్వితీయస్థానం దక్కించుకున్నారు. విజేతలకు రత్నాకర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కన్వీనర్లు దాడి ఈశ్వరరావు, గంటి రవికుమార్, కె.ఎస్.గాంధీ, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కాశీవిశ్వేశ్వరరావు, ఎం.చంద్రశేఖరరావు, 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, క్లబ్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సత్వరం అభివృద్ధి పనులు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం పలు ప్రాజెక్టు పనులు పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులు, ఇంకా పూర్తి కావల్సిన పనులపై ఆరా తీశారు. సంపత్ వినాయగర్ ఆలయం రోడ్డు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి పాతజైల్ రోడ్డు జంక్షన్, అక్కడి నుంచి జగదాంబ జంక్షన్, వైజాగ్ సెంట్రల్, పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, పాతపోస్టాఫీస్ వరకు రోడ్లు, ఫుట్‌పాత్‌లు పరిశీలించారు. అనంతరం ద్వారకానగర్ జంక్షన్ నుంచి గురుద్వార్, శంకరమఠం రోడ్డు, మాధవదార, ఎన్ఎస్‌టీఎస్ గేట్ నుంచి పీఎఫ్ కార్యాలయం వరకు రోడ్ల పనులు పరిశీలించి సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వేంకటేశ్వరరావును ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తొలిసారిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. కళాశాలలో ఉన్న ఈసీఈ, సీఎంఈ విభాగాల్లోని 100 మంది విద్యార్థుల్లో 53 మంది ఉద్యోగాలు సాధించారు. వీరికి విప్ చేతుల మీదుగా సోమవారం నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉదయ్‌భాస్కర్, కమిషనర్ సి.నాగమణి, స్థానిక ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ గాడి అప్పారావు, స్థానిక నాయకుడు దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

తారువ మర్లమాంబ జాతర నేడు

11 ఏళ్ల తర్వాత జరుగుతున్న జాతరకు భారీ ఏర్పాట్లు

దేవరాపల్లి: తారువ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ మర్లమాంబ అమ్మవారి పండగను మంగళవారం భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నేతృత్వంలో 11 ఏళ్ల తర్వాత అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా జరపనుండటంతో భారీగా ఏర్పాట్లు చేశారు. నెల రోజులుగా ప్రతీ రోజు గ్రామంలో సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ఘటాల ఊరేగింపు, ఇతరత్రా పూజలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అమ్మవారి ఆలయానికి రంగులేసి, విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి జాతరకు భారీ స్థాయిలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు.


విద్యుత్ దీపాలంకరణలో మర్లమాంబ ఆలయం

చట్టపరిధిలో సమస్యలకు పరిష్కారం

అనకాపల్లిటౌన్: చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన 14 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలీసు అధికారులతో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(క్రైం) పి.సత్యనారాయణ పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

క్లుప్తంగా

8న దేవతమ్మ ఉత్సవం

కశింకోట : కశింకోటలోని గవరపేటలో రెండేళ్లకోమారు నిర్వహించే దేవతమ్మ ఉత్సవం ఈ నెల 8న జరపాలని నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా ఈ నెల 4న రాత్రి అమ్మవారి పుట్టుక ఉత్సవం జరుగనుందన్నారు. శారదానది అవతల ఉన్న అమ్మవారి పుట్ట వద్ద కొలిచి అమ్మ వారి ప్రతిరూపాన్ని తీసుకువచ్చి గవరపేటలోని ఆలయంలో నిలుపుతామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి నాలుగో రోజు ఉత్సవం జరుపుతామని తెలిపారు. ఉత్సవం రోజున యువకులతో సిద్దుల వేషం, పంచ రంగుల ముగ్గు వేసి సంప్రదాయంగా తొక్కడం, అమ్మవారి నిమజ్జనోత్సవ ఊరేగింపు జరుగుతుందన్నారు. స్థానికులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ×వేగి× ఇంటి పేరు కలిగిన కుటుంబీకులు వచ్చి ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారన్నారు.

4న వరాహలక్ష్మీ నృసింహస్వామి జయంతి

అనకాపల్లి టౌన్ : గవరపాలెం దిబ్బవీధి వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈనెల 4న స్వామివారి జయంతి పురస్కరించుకొని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం పేర్కొన్నారు. 1008 తులసీ దళాలతో శ్రీమన్నారాయణపూజ ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట: కశింకోటలోని శివాలయంలో సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిపారు. పేదలకు అన్న సమారాధ చేశారు.

కరాటే, కిక్ బాక్సింగ్ ఉచిత శిక్షణ తరగతులు

అనకాపల్లిటౌన్ : జిల్లాక్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థాని ఉడ్‌పేట అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఉచిత కరాటే కిక్ బాక్సింగ్ క్రీడలపై శిక్షణ ఇస్తున్నామని కోచ్ ఉమా వెంకట మహేశ్వరరావు సోమవారం పేర్కొన్నారు. ఈ క్రీడలు జూన్ 1వ తేదీ వరకు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు బాల బాలికలు, యువకులకు శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత జిల్లా క్రీడలశాఖాధికారి ఎస్.సూర్యారావు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 9704471628 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 939 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
స్పెషల్ రకం	4,310	4,440
మొదటి రకం	4,060	4,460
రెండో రకం	3,600	3,040
మూడో రకం	3,480	3,570

అనకాపల్లి సినిమాలు

సిసు	రాజా
ఏజెంట్	సత్యనారాయణ స్క్రీన్-1
కలియుగ భగవాన్ (ఉదయం ఆట)	
రారా పెనిమిటి (3ఆటలు)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబి పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 309 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 211 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

కార్మిక హక్కులను కాపాడుకోవాలి



బవులువాడలో...



మార్టూరు గుంకర్లోవలో...



మామిడిపాలెంలో..

- సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు
- గ్రామాల్లో ఘనంగా మే డే వేడుకలు

అనకాపల్లి రూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం అనకాపల్లి పట్టణం ,గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల మే డే వేడుకలు జరిగాయి. పట్టంలోని సీఐటీయు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కాలరాస్తున్నాయని ఆరోపించారు. అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు కొమ్ము కాస్తోందన్నారు. అంతకుముందు సీఐటియు సీనియర్ నాయకుడు ఎ.బాలకృష్ణ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకర్రావు, పరమేశ్వరరావు, గంటా శ్రీరాం, పలువురు కార్మిక నేతలు పాల్గొన్నారు.

ఏఐటీయుసీ ఆధ్వర్యంలో...

కొత్తూరు పంచాయతీలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. ఎర్ర జెండా ఎగురవేసిన అనంతరం నేతలు కార్మికులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఏఐటీయుసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ, సీపీఐ పట్టణ కార్యదర్శి వై.ఎన్. భద్రం, శ్రీరామదాసు, అబ్బులు, కొలగట్ల నాయుడు, లక్ష్మి పాల్గొన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నేతలు ఏఐటీయుసీ జెండాను ఎగురవేసారు. తాకాసి వెంకటేశ్వర్లు, అబ్బులు, కోరిబిల్లి జగదీష్, కొలుసు రాంబాబు, ఒమ్మి సైదులు పాల్గొన్నారు. గుండాల కూడలి వద్ద జరిగిన వేడుకల్లో ఆటో యూనియన్ నేతలు ఎరుకునాయుడు, చందక మంగరాజు, మోహన్,హరీష్ పాల్గొన్నారు. రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో క్వారీ గ్రామాల్లో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ సంఘం జిల్లా నాయకుడు కోన మోహన్‌రావు పాల్గొన్నారు. వర్షంలో సైతం కార్మికులు కార్మిక అమరవీరులకు జోహార్లు అర్పించారు. మార్టూరు, బవులువాడ, మామిడిపాలెం, డ్రిల్లర్స్ కాలనీల్లో జరిగిన ఈ వేడుకల్లో గడి సూర్యారావు, జి.సన్యాసిరావు, చిన్నారావు, గొర్లి రాజు, సేనాపతి సూరిబాబు, దాడి జగ్గారావు, బత్తిన అశోక్, క్వారీ కార్మికులు పాల్గొన్నారు.

వాడవాడలా మేడే వేడుకలు

కశింకోట: మండలంలో సీఐటీయు, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా పలుచోట్ల సోమవారం మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీఐటీయు ఆధ్వర్యంలో కార్మిక,ప్రజా సంఘాలు పాల్గొని సంతబయల మారుతి మండల తాపీ మేస్త్రీల సంక్షేమ సంఘం, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలు, నరసింగబిల్లిలో వికలాంగులు, ముఠా కార్మికులు, తేగాడ వద్ద క్రైబ్స్ కార్మికులు అరుణ పతాకాలను ఎగుర వేశారు. సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు మజ్జి నాగశేషు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఎస్‌కె రెహమాన్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలాగే సీపీఐ జిల్లా నాయకుడు రాజాన దొరబాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన మే డే వేడుకల్లో అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాలు పాల్గొన్నాయి.



డ్రిల్లర్స్ కాలనీలో...



కొత్తూరు పంచాయతీలో



కశింకోట పీహెచ్‌సీ వద్ద ...



కశింకోట పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో

జమాదులపాలెంలో నేడు గడప గడపకు

కశింకోట : మండలంలోని జమాదులపాలెం గ్రామంలో సోమవారం జరగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారానికి వాయిదా పడినట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కర పత్రాలను పంపిణీ చేస్తారన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణోత్సవం

కశింకోట : కశింకోటలోని దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఆలయంలో వేణుగోపాలస్వామి వార్షిక తిరు కల్యాణ ఉత్సవాన్ని సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు వేదమంత్రోశ్చరణల నడుమ సంప్రదాయంగా కల్యాణం జరిపించారు. భక్తులు హాజరై కల్యాణాన్ని భక్తి పారవశ్యంతో తిలకించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పంచాడ పద్మ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్రలో ఇటీవల ముగిసిన మెగా పీపుల్ సర్వేలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొని పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో సోమవారం సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నక్కపల్లి మండలం ఉపమాక వెంకన్న ఆలయంలో ఆయన పలు అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. అంతకుముందు జన్మదిన కేక్ జానీ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్త పంచాడ పద్మ, జీవీఎంసీ సచివాలయాల ఇన్‌ఛార్జి కొణతాల మురళీకృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, నాయకులు ఉగ్గిన అప్పారావు, దొంక సత్తిబాబు, దొడ్డి హరిబాబు, మేడిశెట్టి గణేష్, సోమినాయుడు, కోలా గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ వేడుక జరుపుతున్న అర్చకులు

కోటవురట్ల : స్థానిక ఉమా రామ లింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మయ్య శర్మ, గణేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కల్యాణానికి ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, అగ్ని ప్రతిష్టాపన హోమం, ధ్వజపటం కట్టుట, బలిహరణ నిర్వహించారు. కల్యాణ వేడుక అనంతరం అష్టోత్తర పూజ, నీరాజనం, మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ జరిపారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూరిబాబు



జై జవాన్ జై కిసాన్ వేషధారణలో విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని ఎంపీ గొర్లి సూరిబాబు అన్నారు. గొలగాం పంచాయతీ కేటీ వీపాలెం ప్రాథమిక పాఠశాల 58వ వార్షికోత్సవం పాఠశాల ఆవరణలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి స్థాయి నుంచే తమ లక్ష్యాన్ని తీర్చిదిద్దుకొని ఆ దిశగా అడుగులు వేసి ఉన్నశిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఎంఈవో దివాకర్ మాట్లాడుతూ సర్కారు బడులు ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నాయంటే సీఎం జగన్ మోహన్‌రెడ్డేనని కొనియాడారు. అంతకుముందు కశింకోట వాసి రేలా రేలారే గాయకుడు ఆళ్ల సత్తిరాజు మేజిక్‌షో, గాన కచేరి, విద్యార్థులు ప్రదర్శించిన గణపతి, ఘల్లు ఘల్లు అనే జానపద నృత్యం, లవకుశలో పాటకు పాఠశాలకు చెందిన కవల విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యం, వివేకానందుడు జై జవాన్- జైకిసాన్, పిట్టలదొర, ఆటో ఇటో హాస్య నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డి నారాయణరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, ఉపాధ్యాయ ప్రతిక ఎడిటర్ శీలా జగన్నాథరావు, పీఆర్టీయూ కార్యదర్శి లోయ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూల్.. కూల్..

- తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా వర్షం
- చెరువులను తలపించిన రహదారులు
- స్తంభించిన జనజీవనం

అనకాపల్లిటౌన్ : అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షంలో పట్టణం తడిసిముద్దయింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇటీవల నమోదైన ఉష్ణోగ్రతల నుంచి ఈ వర్షంతో ఉపశమనం దక్కింది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు చెరువులను తలపించాయి. వర్షానికి గాలులు తోడుకాకపోవడంతో విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం ఏర్పడలేదు. ఉదయం వివిధ పనులపై బయటకు వెళ్లేవారికి వర్షం కారణంగా ఇబ్బందులు తలెత్తాయి. అనకాపల్లి-చోడవరం రహదారిలో ఉన్న రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోయింది. అటుగా వెళ్లే భారీ వాహనాలను లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ వేపు ట్రాఫిక్ పోలీసులు మళ్లించారు. లోతట్టు ప్రాంతాలైన గవరపాలెం పరమేశ్వరిపార్కు, ఆర్టీసీ కాంప్లెక్స్, జీవీఎంసీ కార్యాలయ రహదారి, శ్రీరాంనగర్, ఏఎంసీ కాలనీ, నర్సింగరావుపేట సాయిబాబా ఆలయం వెనుక ప్రాంతాల్లో వర్షపునీరు భారీగా నిలిచిపోయింది. ఈ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షపు నీరు పోయేమార్గం లేక ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జోరు వానలో కూడా అవ్వతాతలకు పింఛన్ అందించేందుకు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లారు. పింఛన్ అందించి, వారి ముఖాల్లో ఆనందాన్ని చూసి, మురిసిపోయారు. శ్రమజీవులు ఏడాదికోసారి నిర్వహించుకునే మే డే వేడుకలకు వర్షం కాస్త ఆటంకం కలుగజేసింది. వర్షం లేకుంటే పట్టణమంతా ఉదయం 6 గంటలకు అరుణ పతాకాలు ఎగురవేసి కార్మికులు సంబరాలు చేసుకునేవారు.

కశింకోట : మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జల్లులుగా మోస్తరు వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు, మడుల్లో నీరు చేరింది. వాతావరణం చల్లబడింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. వర్షం చెరకు ఉడుపు, కార్శి తోటలకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు. అయితే కోత దశకు వచ్చిన నువ్వు పంట వర్షానికి తడిచి దెబ్బతింటుందని పలువురు రైతులు వాపోయారు. గతంలో పూత దశలో ఉన్నప్పుడు అకాల వర్షాలు నువ్వు పంటకు నష్టం కలిగించాయని, ఇప్పటి వర్షం పండిన పంటకు నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కశింకోట మండల పరిషత్ కార్యాలయ రోడ్డులో పల్లపు ప్రాంతంలో చేరిన వర్షపు నీరు

నేత్రపర్వంగా వెంకన్న కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు సందర్భంగా కోలాటమాడుతున్న మహిళలు

నక్కపల్లి : మండలంలో వేంపాడు గ్రామంలో వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వెంకన్న వార్షిక కల్యాణం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కోలాట బృందాలతో కోలాట కార్యక్రమాలు జరిగాయి. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన జరిపారు. డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, గునిపూడి సర్పంచ్ అయినంపూడి చినపేర్రాజు, స్థానిక నాయకులు సురేష్‌రాజు, బాబ్జిరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ద్వారా మేలు

మునగపాక : భూసార పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని బీసీటీ శాస్త్రవేత్త శ్రీహరి కోరారు. అరబుపాలెం గ్రామంలో సోమవారం బీసీటీ ఆధ్వర్యంలో భూసార పరీక్షల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. నేల సారవంతంగా ఉన్ననాడే ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు. పశువుల గెత్తం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్టు వంటి ఎరువులను వినియోగించా లన్నారు. వ్యవసాయ భూముల్లో ఎటువంటి పోషకాలు ఉన్నాయో తెలుసుకునేందుకు భూ సార పరీక్షలు దోహదపడతాయన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త పీపీ నాయుడు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీటీ శాస్త్రవేత్త శ్రీహరి

గ్రామ దేవతల పండగ నేడు

కె.కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారు, ఎ.భీమవరంలో మరిడిమాంబ అమ్మవారి పెద్ద పండగలను మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆరేళ్ల తర్వాత ఆర్లి పైడితల్లమ్మ పండగ, ఐదేళ్ల తర్వాత ఎ.భీమవరం మరిడిమాంబ పండగ రావడంతో రెండు గ్రామాలూ విద్యుత్ దీపాలంకరణలతో పండగ శోభను సంతరించుకున్నాయి. సంప్రదాయం మేరకు పండగ రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

అనకాపల్లిటౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం గ్రామం తారకరామాకాలనీలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆయన వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. నెలరోజులపాటు జరిగే ఈ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిట్నెస్ అండ్ బాక్సింగ్ క్లబ్ కోచ్ దువ్వాడ హరీష్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సూరిబాబు

దేవాలయ భూముల కౌలుకు వేలం నేడు

నాతవరం : మండల కేంద్రంలోని శ్రీగంగాదేవి, శ్రీనూకాలమ్మ దేవస్థానం భూముల కౌలుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు యలమంచిలి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవదాయశాఖకు చెందిన వ్యవసాయ పంట భూముల్లో సాగు కోసం కౌలుకిచ్చేందుకు నాతవరం రామాలయం వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం పాట జరగనుందన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ పెద్ద లు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో జరిగే వేలం పాటకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు దేవదాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

డీసీఎంఎస్‌కు యల్లపు సేవలు మరువలేనివి



సూర్యనారాయణకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మునగపాక : డీసీఎంఎస్ అభివృద్ధికి దివంగత యల్లపు సూర్యనారాయణ అందించిన సేవలు అభినందనీయమని వైస్ ఎంపీపీ చిందాడ దేవి అన్నారు. నాగులాపల్లిలో సూర్యనారాయణ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడారు. సూర్యనారాయణ పలు పదవులు అలంకరించి వాటికి వన్నె తెచ్చారని, నాగులాపల్లి గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరాహ సత్యనారాయణ, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పాలసంఘ మాజీ అధ్యక్షుడు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా శివకేశవుల కల్యాణోత్సవం



కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

రావికమతం : ప్రసిద్ధి చెందిన కొత్తకోట శివకేశవ స్వామివార్ల ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామివారికి, రాజరాజేశ్వరి సమేత శ్రీరాజలింగేశ్వర స్వామివారికి వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంతోపాటు, పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా అమ్మవార్లను, స్వామివార్లను ఒకే వేదికపై అధిష్ఠింపజేసి పాంచరాత్ర, శైవాగమోక్తంగా కార్యక్రమాన్ని గుమ్ముడు దొరబాబు, పెనుగొండ నానాజి, పెనుగొండ నూకేశరావు దంపతుల చేతుల మీదుగా దేవదాయశాఖ నిర్వహించింది.